# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

Every man`s work, weather it be literature or music or picture or architecture or anything else is always a portrait of himself.

---John Stein beck

# 7

## శ్రీ చలసాని ప్రసాదరావు



1975లో ఓ రోజు మద్రాసు నుంచి హైదరాబాద్ వచ్చిన శ్రీ వేమూరి సత్యనారాయణ, నన్ను ఆబిడ్స్‌లోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయానికి తీసుకెళ్ళారు. అప్పట్లో దిల్షాద్ సినిమా కాంప్లెక్స్‌పై భాగంలో మార్గదర్శి హెడ్డాఫీస్ ఉండేది. అక్కడ శ్రీ చలసాని ప్రసాదరావుని నాకు పరిచయం చేసారు.

ఈనాడు సండే సప్లిమెంట్‌కి ఆయన ఎడిటర్. హైదరాబాద్‌లో ఇంకా అప్పటికి ఈనాడు కార్యాలయం లేదు. శ్రీ చలసానికి వినపడదు. కాగితం మీద రాసి చూపించాలి. ఈనాడు ఆదివారం అనుబంధానికి వ్యాసాలని అనువదించమని నన్ను ఆయన కోరారు. ఏ టాపిక్ అయినా ఫర్వాలేదని చెప్పారు. నేను రీడర్స్ డైజెస్ట్‌లోని కొన్ని వ్యాసాలని స్వేచ్ఛానువాదం చేసి పంపితే బావున్నాయని, పంపుతూండమని వెంటనే జవాబు వచ్చింది. కొద్దికాలానికి రీడర్స్ డైజెస్ట్ నుంచి వచ్చిన ఉత్తరాన్ని చూపించారు. తమ పత్రికలోవి వాడద్దని హెచ్చరించే ఉత్తరం అది. ఆ తరువాత రీడర్స్ డైజెస్ట్ నుంచి అనువాదాలు మానేశాను. కొరొనెట్, పేజెంట్ అనే అమెరికన్ మాసపత్రికలనుంచి అనువదించేవాడిని.

అప్పట్లో ఈనాడు సండే సప్లిమెంట్ పుస్తకంలా కాక, దినపత్రిక సైజ్ లో నాలుగు పేజీలు వచ్చేది. మొదటి పేజీలో ఏదైనా స్పెషల్ స్టోరీ ఫోటోలతో వేసేవారు. లోపలి పేజీల్లో ఓ మినీ కథ, పుస్తక సమీక్ష మొదలైన శీర్షికలు ఉండేవి. . మిగతావన్నీ నాన్ ఫిక్షన్ ఆర్టికల్సే. వ్యాసానికి పదిహేను రూపాయలు చొప్పున పంపేవారు. కిష్టప్ప, శిల్పి, రేవతి, యం.వి.కె. మూర్తి, మల్లాది, ఆశ్లేష, రాజు, రాణి, పృధ్వీరాజ్, పృధ్వి, యం ఇంకా అనేక కలం పేర్లతో వ్యాసాలని రాసేవాడిని. అలా నావి వెయ్యికి పైగా ఆర్టికల్స్ సండే సప్లిమెంట్‌లో శ్రీ చలసాని ప్రచురించారు. 'గూఢచారి జగత్' అనే నాన్ ఫిక్షన్ సీరియల్‌కూడా అందులో వచ్చింది. తర్వాత సోమాజీ గూడాలోని ఈనాడు కార్యాలయం కట్టాక, శ్రీ ప్రసాదరావు ఆఫీస్ అక్కడికి బదిలీ అయింది. సెకండ్ ఫ్లోర్‌లో ఓ మూల ఆయన సీట్ ఉండేది.

ఓ సారి మాటల్లో చెప్పారు.

"శ్రీ రామోజీరావు ఈనాడు హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభిస్తూ సండే సప్లిమెంట్ ఎలా ఉంటే బావుంటుందో సూచించమని నన్ను కోరారు. ఏ ఏ ఫీచర్స్ ఉంటే బావుంటాయో నేను వివరంగా రాసిచ్చాను. అది చదివి నన్నే ఎడిటర్‌గా ఉండమని కోరారు. రాష్ట్ర ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే నేను సెలవు పెట్టి ఈనాడు సండే సప్లిమెంట్ ఎడిటర్‌గా వ్యవహరించాను. తర్వాత ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను."

శ్రీ రామోజీరావు శ్రీ చలసాని పోయేదాకా తన సంస్థలో ఆయన్ని కొనసాగించారు.

మొదటి పేజీలో కొన్ని ప్రత్యేక వ్యాసాలని శ్రీ ప్రసాదరావు నా చేత రాయించారు. 1975లో ఓ రోజు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో సర్కస్‌చూసాను. దాని మీద ప్రత్యేక వ్యాసం రాద్దామనిపించి, వారినడిగితే శ్రీ ప్రసాదరావు ఈనాడు లెటర్ హెడ్ మీద సర్కస్ మేనేజర్‌కి నన్ను విలేకరిగా పరిచయం చేస్తూ ఉత్తరం రాసిచ్చారు.. సర్కస్‌లోని వాళ్ళని ఇంటర్వ్యూ చేసి 'ఈవారం ప్రత్యేకం' శీర్షిక కింద దాన్ని రాసిస్తే ప్రచురించారు. అదే నెలలో నెహ్రూ జూపార్క్‌కి వెళ్ళి ఇదే పద్ధతిలో సమాచారం సేకరించి ఓ స్పెషల్ స్టోరీని రాసిచ్చాను. 1976 జనవరిలో హైదరాబాద్ లోని ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ మీద కూడా స్పెషల్ ఆర్టికల్‌ని రాసాను. సాలార్‌జంగ్ మ్యూజియం మీద కూడా రాసిన గుర్తు.

సర్కస్, నెహ్రూ జూ పార్క్‌ల మీద వ్యాసాలు రాస్తున్నప్పుడు నాకు 'నగరంలోకి పులి తప్పించుకుంటే ఏమవుతుంది?' అనే ఆలోచన కలిగింది. అదే నేను రాసిన 'అదిగో పులి' నవలకి ప్రేరణ అయింది.

ఇలా మరికొన్ని ప్రత్యేకవ్యాసాలు రాసాను.

శ్రీ చలసాని ప్రసాదరావు ఆదర్శవంతమైన మనిషి. వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ ఆయన తన ఆదర్శాలని ఎన్నడూ విస్మరించలేదు. చిన్నప్పుడు టైఫాయిడ్ వచ్చి వినికిడి శక్తి కోల్పోయారు. అయినా స్వశక్తితో చదువుకుని పైకి వచ్చారు. ఆయన సెల్ఫ్ మేడ్ మాన్. కమ్యూనిస్ట్ భావజాలం ఆయన్ని బాగా ప్రభావితం చేసింది. చివరిదాకా ఆయన సిసలైన కమ్యూనిస్టులానే జీవించారు. చివరలో కమ్యూనిస్టుల కీచులాటల మీద 'ఇలా మిగిలేం'అనే పుస్తకం నిష్పక్షపాతంగా రా సారు.

ఆయన యువకుడిగా ఉండగా విజయవాడలోని విశాలాంధ్ర ప్రింటింగ్ ప్రెస్‌లో కొంతకాలం పనిచేసారు. చిత్రలేఖనం అంటే ఆయనకి బాగా ఆసక్తి. ఫోటోగ్రఫీలో కూడా మంచి అభిరుచి ఉంది. ఆయన ఇద్దరు పిల్లల్ని కలిపి తీసిన ఫోటో వారింట్లో గోడ మీద పెద్దగా ఎన్‌లార్జ్ చేసి అతికించారు.

ఆయన ఎప్పుడూ ఇలా చెప్పేవారు.

"అన్నీ ఆలోచించి ఓ ఆదర్శం బావుందనుకుని పెట్టుకున్నాక, ఇక ఆరునూరైనా దాన్ని అతిక్రమించకూడదు.

దీన్నాయన అక్షరాలా పాటించేవారు. ఆయన రచయితలకి, విలేఖరులకి వారి మొహం మీదే లోపాలని ఎత్తిచూపుతూ చురకలు వేసేవారు కాని ఎవరూ నొచ్చుకునేవారు కాదు. ఆయన మనసులో ద్వేషం కాని, కల్మషం కాని ఉండవని అందరికీ తెలుసు కాబట్టి నవ్వేసేవారు.

ఓ రోజు శ్రీ రామోజీరావు జంట మాసపత్రికలని, తను ఎడిటర్‌గా తీసుకొస్తున్నారని, వాటి పేర్లు విపుల, చతుర అని, విపులలో అనువాద కథలు ప్రపంచ భాషలన్నింటి నుంచి వేస్తామని, చతురలో ఓ పూర్తి నవల వేస్తామని చెప్పారు. నేను వారితో కొంతసేపు కంటెంట్ విషయం చర్చించాను. తేడా తెలియటానికి విపులలో పేజీకి రెండు కాలమ్‌లు. చతురలో ఒకే కాలం ఉంచుతామని ఆయన చెపితే, నేను చతురలో కూడా రెండు కాలమ్స్ ఉంటే బావుంటుందని, అందువలన మేటర్ ఎక్కువ పడుతుందని సూచించాను. ఆయనకి తెలిసినా, తెలియనట్లుగా 'అలా ఎలా అవుతుంది?' అని అడిగారు. వెంటనే నేను ఆయన ముందున్న స్క్రిబ్లింగ్ పేడ్ అందుకుని ఇలా రాసి చూపించాను.

"మీ పేరు?"

"నువ్వే చెప్పుకో"

దీన్ని కాలంలో వేస్తే పక్క కాలం లోని స్పేస్ ఆదా అవుతుంది. సింగిల్ కాలమ్ అయితే స్పేస్ వృధా అవుతుంది. నవలలో డైలాగ్ కంటెంట్ ఎక్కువ ఉంటుంది. కాబట్టి స్పేస్ వృధా కాకూడదనుకుంటే డబుల్ కాలంమ్ బెటర్ అని చెప్పాను.

"మరి ఏలూరు రోడ్డు పబ్లిషర్స్ నవలలో ఒకటే కాలమ్ కదా ఉపయోగించేది?" అడిగారు.

"మీది పత్రిక. అవి నవలలు. నవలల్లో డబుల్ కాలం ప్రపంచంలో ఎక్కడా లేదు."

ఆయనకి నా సూచన నచ్చడంతో అలాగే డిజైన్ చేసారు. నన్ను ఓ నవల అడిగితే రాసిచ్చాను. అది ఆఫ్‌బీట్ నవల కాబట్టి, మొదటి సంచికలో వేస్తారని ఆశించాను. కాని 'కొత్తశత్రువు' అనే నా నవలని రెండో సంచికలో అనుకుంటా వేసారు. మొదటి సంచికలో శ్రీ సి.యస్. రావ్ రాసిన 'కమలమ్మ కమతం' వచ్చింది.

విపులకి నేను పృధ్వీరాజ్ అనే కలం పేరుతో, నా పేరుతో అనేక అమెరికన్ క్రైం కథలని అనువదించాను.

**చతుర, విపుల మంత్లీల ఆవిర్భావం వెనక ఓ కథ ఉంది.**

1980లలో ఆంధ్రభూమి వారపత్రిక సర్క్యులేషన్ బాగా పెరగడంతో అంతదాకా వారపత్రిక లేని 'ఈనాడు' గ్రూప్ కూడా వీక్లీని తీసుకురావాలనుకుంది. అప్పట్లో వచ్చే డైలీలు ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్ర భూములకి వార పత్రికలుండేవి. శ్రీ చలసానికి వీక్లీని డిజైన్ చేసే పనికూడా అప్పగించబడింది. ఆయన ఆ విషయం నాతో ఒకటి రెండుసార్లు చర్చించారు. తాత్కాలికంగా వసుంధర అనే పేరు కూడా నిర్ణయించారు. చిన్న సమస్య ఏమిటంటే, ఆ రోజుల్లో వారపత్రికల సర్క్యులేషన్ వాటిలో వచ్చే సీరియల్స్ మీద ఆధారపడి ఉండేది. శ్రీ రామోజీరావుకి సీరియల్స్ ప్రచురించడం ఇష్టం లేదని శ్రీ చలసాని చెప్పారు. అవి లేకపోతే పత్రిక సర్క్యులేషన్ సమస్య అవుతుంది. ప్రాచుర్యం గల రచయితలు కోరే పారితోషికం ఇచ్చి వారి చేత సీరియల్స్ రాయించడం 'ఈనాడు గ్రూప్' పాలసీకి విరుద్ధం.

దాంతో వారపత్రిక ఆలోచన వాయిదా పడింది.

నవల ఆనాటి పాఠకులని ఆకర్షించే సాహితీ ప్రక్రియ, ఎందుకంటే నవలల అమ్మకాలు బాగా పెరిగాయి. పూర్వం వెయ్యి కాపీలు వేస్తూంటే, 1980 లలో 12000 వేలదాకా  మొదటి ఎడిషన్‌గా విజయవాడలోని ప్రచురణకర్తలు ప్రచురించేవారు. వార పత్రికకి బదులు నవలలని ముద్రించే ప్రచురణ సంస్థని తేవాలని కూడా ఈనాడు గ్రూప్ ఆలోచించింది. మళ్ళీ సమస్య రచయితలతోనే, రచయితలకి ఆ రోజుల్లో ప్రచురణ సంస్థలు ఇచ్చేంత పారితోషికం వీరు ఇవ్వరు. కాని సాహితీ ప్రియుడైన ప్రసాదరావుగారికి నవలా ప్రచురణ సంస్థ మీద గట్టి ఆసక్తి ఉండేది. నెల నెలా ఒక నవలని మాసపత్రిక రూపంలో ఇవ్వాలనే ఆలోచన చివరికి ఫైనలైజ్ అయింది. ఇందువల్ల నవలని న్యూస్ ప్రింట్‌తో వేసి తక్కువ ధరకి ఇవ్వచ్చు. బెజవాడ పబ్లిషర్స్ తెల్లకాగితం మీద ప్రింట్ చేసి ఎక్కువ ధరకి అమ్మేవారు. ఆ విధంగా చతుర మంత్లీ రూపుదిద్దుకుంది.

నవలలన్నీ ఒకే లెంగ్త్‌లో ఉండవు కాబట్టి, మేగజైన్‌లో ఫిల్లర్స్‌గా 'చతుర కతలు' 'చతుర ప్రపంచం గత నెల నవల మీద అభిప్రాయం మొదలైన శీర్షికలు అనుకుని 'చతుర ప్రపంచం' నన్ను రాయమని శ్రీ చలసాని కోరారు. అవన్నీ పాశ్చాత్య దేశాలకి చెందిన అనువాదాలే అయి ఉండాలి. తప్ప భారత దేశానికి సంబంధించినవి ఉండకూడదు అని నిర్దేశించారు. అప్పటికే ఈనాడు సండే సప్లిమెంట్‌లో దాదాపు వెయ్యిదాకా అలాంటి వ్యాసాలు రాసిన అనుభవం నాకు ఉంది కాబట్టి ఆ బాధ్యత నాకు అప్పగించారు. మధ్యలో రెండేళ్ళ బ్రేక్‌ని వదిలేస్తే, ఇప్పటిదాకా ఆ శీర్షికని నేనే నిర్వహిస్తున్నాను.




1990లో నేను అమెరికా వెళ్ళినప్పుడు 'ది నేషనల్ ఎంక్వైరర్,  గ్లోబ్ అనే వార పత్రికలని కొన్నిటిని కొన్నాను. వాటిలో చిత్రమైన ఫోటో ఫీచర్ ఉండేది. శ్రీ ప్రసాదరావుకి వాటిని చూపిస్తే, చతురకి బావుంటుందని నన్ను రాయమని కోరారు. 'చిత్ర విచిత్రం' పేరుతో శ్రీ చలసాని వాటిని శీర్షికగా చతురలో వాడారు. ఆయన పోయాక దాన్ని, చతుర ప్రపంచాన్ని తర్వాతి ఎడిటర్ రద్దు చేసారు.

నవలతో పాటు కథలకు మేగజైన్ కూడా జంటగా తీసుకు రావాలన్న ఆలోచన, అన్ని మంచి కథలు తెలుగు రచయిత నుంచి రాకపోవచ్చనే ఆలోచనల మిశ్రమంతో 'విపుల' రూపు దిద్దుకుంది. ఇతర భారతీయ భాషల రచయితల నుంచి అనుమతి పత్రాలు, రచయిత పంపని పక్షంలో తామే వాటిని సంపాదించే బాధ్యతని కూడా చలసాని తీసుకున్నారు.

వివిధ భారతీయ భాషల ఇంగ్లీష్ అనువాదాల కథా సంపుటాలని కొని, చదివి నచ్చినవి, శ్రీధర, పాలకోడేటి... ఇలా కొందరు రచయితలకి వాటినిచ్చి, అనువాదం చేయించి కథలని సిద్ధం చేసారు. నేను అమెరికన్ క్రైం కథలని సంపాదించుకుని వాటిని అనువదించి ఇవ్వసాగాను.

అదే పీరియడ్‌లో ఓసారి నా నవల రేపటి కొడుకుని సినిమా తీయడానికి సంకల్పించి శ్రీకాంతారావు నన్ను మద్రాస్‌కి పిలిపించారు. మౌంట్ రోడ్‌లోని మద్రాస్ ఇంటర్నేషనల్ అనే హోటల్లో బస చేసాను. అక్కడికి సమీపంలో గోపాలపురం వైపు ఉదయం వాకింగ్‌కి వెళ్ళినప్పుడు పాత పుస్తకాలు అమ్మే షాపు ఒకటి కనిపించింది. అందులో నాకు దొరికిన ఆల్‌ఫ్రెడ్ హిచ్ కాక్ ఎడిట్ చేసిన అనేక క్రైం కథల సంకలనాలని కొన్నాను. ఆల్‌ఫ్రెడ్ హిచ్ కాక్ మిస్టరీ మేగజైన్, ఎల్లరీక్వీన్ మిస్టరీ మేగజైన్స్ కోసం వెదికితే, మద్రాస్‌లోని కొన్ని పాతపుస్తకాల షాపుల్లో దొరికాయి. వాటిల్లోని కథలని విపులకి అనువదించాను. తిరస్కరించకుండా అన్నింటినీ ఆయన వెంట వెంటనే వేసుకునేవారు.

అలా ఈ రెండు పత్రికలు మొదలైన చాలాకాలానికి ఓ రోజు శ్రీ చలసాని, వార పత్రికని 'ఈనాడు అనుబంధం'గా తెద్దామని శ్రీ రామోజీరావు నిర్ణయించారని, అది దిన పత్రికకి అనుబంధంగా వెళుతుంది కాబట్టి సర్క్యులేషన్‌కి, సీరియల్‌కి సంబంధం ఉండదని చెప్పారు. శ్రీ రామోజీరావే దాన్ని స్వయంగా పర్యవేక్షిస్తారని చెప్పారు. దాని ఇన్ ఛార్జ్ ఎడిటర్‌గా శ్రీ వర్మ అనే ఆయన్ని నియమించారు. తనని ఎడిటర్ గా తీసుకోనందుకు శ్రీ చలసాని బాధ పడ్డారు. చతుర, విపులలు ఆర్థికంగా అంతగా ఆదాయం తెచ్చే పత్రికలు కావు. దాంతో 'నేను దివాల కోరు పత్రికల ఎడిటర్‌ని' అని నాతో అనేక సార్లు అన్నారు.

శ్రీ చలసానితో రచయిత, సంపాదకుడి సంబంధం కంటే, నాకు వ్యక్తి గత స్నేహ సంబంధం బలపడింది. కారణం ఆయన విశిష్టమైన వ్యక్తిత్వం. అన్నిటా ఫెయిర్‌గా ఉండేవారు. తరచూ సాయంకాలాలు ముందే ఫోన్ చేసి ఆయన ఆఫీస్‌కి వెళ్ళి పికప్ చేసేవాడిని. ఆబిడ్స్ ప్రాంతంలో ఎస్.బి.హెచ్ ఎదురుగా మేడ మీద 'బ్రాడ్వే' అనే బార్ అండ్ రెస్టరెంట్‌కి వెళ్ళేవాళ్ళం. చికెన్ సిజ్లర్ అనే అయిటమ్ చెప్పేవాడిని. పొగలు కక్కుతూ వచ్చే అది ఆయనకి కొత్త. చాలామందితో ఆయన అనేవారు, 'మందు దగ్గర తినడానికి ఏం ఆర్డరివ్వాలో మల్లాదికి బాగా తెలుసు'. కల్మీ కబాబ్ అనే మరో చికెన్ ఐటమ్ కూడా ఆర్డర్ చేసేవాడిని. వీటిలో నూనెని ఉపయోగించేవారు కాదు. అయితే శ్రీ ప్రసాదరావు బిల్ ఎప్పుడూ పే చేసేవారు కాదు. షేర్ కూడా చేసేవారు కాదు.

ఆ తర్వాత ఈనాడు ఆఫీస్ ఎదురుగా ఉన్న ఓ భవంతిలోకి ప్రెస్ క్లబ్ మారింది. ఆ పాత్రికేయుల క్లబ్‌లోకి సభ్యత్వం ఉన్నవారికే అనుమతి. డ్రింక్స్ సర్వ్ చేసేవారు. బార్ కంటే చాలా చవక. శ్రీ చలసాని నన్ను అక్కడికి తీసుకెళ్ళేవారు. నేను మందు మానేదాకా వారంలో ఓ రోజు (శనివారం అనుకుంటా) తప్పని సరిగా అక్కడ కలిసేవాళ్ళం. వెనిగళ్ళ వెంకట రత్నం అనే మరో రచయిత సహవాసి అనే ఈనాడు జర్నలిస్ట్, దేవులపల్లి అమర్ మొదలైన వారు నాకు అక్కడ పరిచయం. నాకు కూడా ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం కోసం ప్రసాదరావు రికమెండ్ చేసారు. నేను ఏ పత్రికలో పనిచేయని కారణంగా కొందరు సభ్యులు అడ్డుపడ్డారు. "స్రవంతి" వీక్లీ ఎడిట్ చేసాను కాబట్టి నాకు అర్హత ఉందని ఆయన రికమెండ్ చేసి నా చేత అప్లికేషన్ పెట్టించారు. నేను మందు మానేసాక 2000 లలో సభ్యత్వం మంజూరైంది కాని అప్పటికే మందు మానేసిన నేను దాన్ని అంగీకరించలేదు. అంగీకరిస్తే చాలా బెనిఫిట్స్ ఉంటాయని, జర్నలిస్ట్ కోటాలో స్థలం దొరకొచ్చని శ్రీ ప్రసాదరావు చెప్పారు కాని నాకు ఆసక్తి పోయింది. మందు కార్యక్రమం అయాక శ్రీ ప్రసాదవుని నా మోటార్ సైకిల్ లేదా కారులో వారింటి దగ్గర ఎంత అర్ధరాత్రయినా దింపి వెళ్ళేవాడిని. జూబ్లి హిల్స్‌లోని జర్నలిస్ట్ కాలనీలో ఆయన ఇల్లు కట్టుకున్నారు. ఆయన సంపన్నులుండే ఆ ప్రాంతంలో గృహనిర్మాణం చేయడం మీద 'ఈయనేం కమ్యూనిస్ట్?' అని కొందరు విమర్శించారని ఆయన నాకు దాపరికం లేకుండా చెప్పారు. అంతకు మునుపు ఆయన రాజ్‌భవన్ రోడ్‌లోని ఓ వీధిలోంచి లోపలికి వెళితే, హుసేన్ సాగర్ ఎదురుగా ఓ ఇంట్లో ఉండేవారు. ఇప్పుడా ప్రాంతంలో నెక్లెస్‌రోడ్ వచ్చింది.

జూబ్లీ హిల్స్‌కి మారాక ఆయన నన్ను మూడు, నాలుగుసార్లు మందు పార్టీకి ఆహ్వానించారు. ఎస్వీ రామారావు అనే ఆర్టిస్ట్ వారింట్లోనే నాకు పరిచయం.

జూబ్లీహిల్స్‌లోని ఇంటిని మొదటిసారి నాకు చూపించినప్పుడు ఇంటి వెనక భాగం చూపించారు. దాదాపు వంద అడుగుల దాకా కింద లోయలోంచి పిల్లర్స్ లేపి వెనకాల బేక్‌యార్డ్‌ని నిర్మించారు. అంతకు మునుపు ఓసారి జూబ్లి హిల్స్‌లో భూకంపం వచ్చింది. అందువలన భూకంపాలకి కూడా చెక్కు చెదరని విధంగా ఆ పిల్లర్స్ నిర్మాణం జరిగిందని చెప్పారు.

ఆర్. కె. లక్ష్మణ్ శ్రీ చలసాని కేరికేచర్‌ని గీసారు. కుష్వంత్ సింగ్ తన రచనలు తెలుగులో విపులలో పారితోషికం లేకుండా ప్రచురించుకునే హక్కుని ఇస్తూ ఓపెన్ లెటర్‌ని శ్రీ ప్రసాదవుకి పంపారు. చాలామంది ఇతర భాషల రచయితలతో శ్రీ ప్రసాదరావు ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపేవారు. ఆయన 'కాకతీయ' అనే పత్రిక, కళ అనే సాంస్కృతిక మాసపత్రికలని ఎడిట్ చేసేవారు.

ఆయనకి వినపడదు కాబట్టి మనం కాగితం మీద రాస్తే చదువుతారు. 'ఏదైనా ప్రసాదరావు మనచేత కాగితం మీద కమిట్ చేయిస్తారు' అని రచయితలు హాస్యంగా అనేవారు. కాని ఆయన చాలా నిబద్ధతగా ఒకరు రాసింది మరొకరికి చూపించడం ఎన్నడూ చేయలేదు. మందు మీద మనం ఎవరి గురించి ఏం రాసినా, ఆ కాగితాలని మన ముందే పీలికలుగా చింపి పారేసేవారు.

1980లలో రచయితల నవలా యుగం మొదలయ్యాక దాని గురించి నన్ను ఆసక్తిగా అడిగి తెలుసుకునేవారు. ఇతర ఎడిటర్స్ గురించి కూపీలాగే ప్రశ్నలు వేసేవారు. అది తమ సంస్థకి ఉపయోగకరం అని భావించి అడిగేవారు. కొత్త ఎడిటర్‌ని తీసుకునే ముందు శ్రీ రామోజీరావు, చలసానిని అభిప్రాయం అడిగితే, చెప్పడానికి తయారుగా ఉండడానికే ఈ ప్రయత్నం అని నాకు అర్థమైంది.

ఈనాడు డెయిలీలో 'కబుర్లు' శీర్షికన వ్యంగ్య వ్యాసాలు రాసేవారు. క్రమశిక్షణగా ప్రతి బుధవారం సాయంత్రం ఆఫీసయ్యాక, ఆఫీస్‌లోనే కూర్చుని దాన్ని రాసిచ్చి వెళ్ళేవారు. దానికి ఆయనకి పారితోషికం ముట్టేది కాదు. ఆయన పోయాక ఆ కాలమ్ లాంటి కాలాన్ని మరే రచయితా ఇంతదాకా విజయవంతంగా రాయలేదనే చెప్పాలి. 'కబుర్లు'ని ఆయన జీవించి ఉండగానే పుస్తక సంపుటిగా వెలువరించారు. ప్రాచీన శిల్పాల మీద కూడా ఓ పుస్తకాన్ని ఆయన రాసి ప్రచురించారు.

శ్రీ ప్రసాదరావు పక్క సీట్లోనే సితార వారపత్రిక మేనేజర్‌గా వ్యవహరించే శ్రీ అట్లూరి రామారావు ఉండేవారు. శ్రీ చలసాని ద్వారా ఆయన నాకు పరిచయం. తర్వాత ఉషాకిరణ్ మూవీస్ మొదలవగానే ఆయన సినిమా నిర్మాణ వ్యవహారాలు చూసుకోవడానికి వెళ్ళిపోయారు.

ఓ సారి నెలరోజుల పాటు శ్రీ ప్రసాదరావు ఆఫీస్‌కి రాలేదు. తర్వాత కలిసినప్పుడు చెప్పారు. వెల్లూరుకి వెళ్ళి గుండెకి ఆపరేషన్ చేయించుకు వచ్చానని. ముందుగా ఎవరికీ చెప్పలేదు. ఆయన సిగరెట్లు ధారాళంగా తాగేవారు. చివర్లో వాటిని ఆపాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకటి రెండుసార్లు ఆయన భార్యకి తెలీకుండా వారింట్లోంచి నాతో బయటకి వచ్చి సిగరెట్ తాగిన సందర్భాలున్నాయి.

నేను మందు మానేసాక మేం వారం వారం కలవడం పూర్తిగా పోయింది. 'తాగకపోయినా ఫర్వాలేదు. కబుర్లు చెప్పుకోడానికి రావచ్చుగా?' అని 2000 జనవరి నుంచి అనేకసార్లు ఉత్తరాలు రాసారు కాని నాకు ఆ వాతావరణం మీద పూర్తిగా ఏహ్యాభావం కలగడంతో వెళ్ళలేకపోయాను. వారికి ఆరోగ్యం బాలేదని, హాస్పటల్‌లో ఉన్నారని ఓ రోజు వెంకటరత్నంగారు ఫోన్ చేసారు. క్రితం రోజే డిస్చార్జ్ అయ్యారని తెలిసి వారింటికి వెళ్ళి చూసాను. ఊపిరి తిత్తుల సమస్య. దానికి ఎక్సర్ సైజ్ కోసం నోటితో ఊదే ఓ పరికరాన్ని ఆయన దగ్గర చూసాను. తను త్వరలోనే పోతానని ఆయన గ్రహించారు. 'నా తర్వాత ఈ పుస్తకాలన్నీ ఏమైపోయాయో?' అని తను సేకరించిన వందల పుస్తకాలని చూసి అన్నారు. నేను పూర్వం వారికి ఇచ్చిన పుస్తకాలలో కొన్నింటిని నాకు వెనక్కిచ్చేసారు. అనారోగ్యంతో చివర్లో ఆఫీస్‌కి వెళ్ళకపోయినా నెల నెలా విపుల ఆఫీస్ నుంచి ఆయనకి జీతం అందేది.

2001 జూలై నెలలో నేను హిమాలయాల్లోని యమునోత్రి, గంగోత్రి కేదార్ నాథ్, బదరీనాథ్‌లని ఓ నెలపాటు సందర్శించాను. నేను తిరిగి వచ్చాక తెలిసింది, శ్రీ చలసాని ప్రసాదరావు పోయారని. నేను వచ్చిన మర్నాడే హైదరాబాద్‌లోని బర్కత్ పురాలోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో ఆయన సంస్మరణ సభ జరిగింది. దానికి హాజరయ్యాను. ప్రతి వక్తా ఆయనలోని ఉత్తమ సంస్కారాలని గుర్తుచేసారు.

ఆయన టేబుల్ ఎంతో శుభ్రంగా ఉండేది. అన్నీ వేటిస్థానంలో అవి ఉండేవి. వేటికోసం వెతుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. బీరువా తెరిస్తే, పుస్తకాలు, ఫైళ్ళు, కవర్లు నీట్‌గా సర్ది ఉండేవి. అశుభ్రతని, క్రమశిక్షణారాహిత్యాన్ని ఆయన భరించలేకపోయేవారు. నాతో మాట్లాడుతూనే, సరిగ్గా చింపని ఓ రచయిత పంపిన స్క్రిప్ట్‌లోని తెల్లకాగితం చివర్లలో స్కేల్ ఉంచి, బ్లేడ్‌లో దాన్ని నీట్‌గా కట్ చేసేవారు.

చతురలో 'చతుర ప్రపంచం' అనే శీర్షికని నేనే మెయిన్ టెయిన్ చేసేవాడిని. శ్రీ బుర్రా సుబ్రమణ్యం, శ్రీ జగన్నాథ శర్మ, లక్ష్మి (త్రిపురనేని గోపీ చంద్ కోడలు) కె.బి లక్ష్మి, రామకృష్ణారావు మొదలైనవారు ఆయన దగ్గర సబ్ ఎడిటర్స్‌గా పనిచేసేవారు.

ఓ రోజు నన్ను చతురకి నవలని అడిగారు. నాకు బయట పత్రికల్లో వచ్చే పారితోషికం, వారిచ్చే దానిన్నా ఎన్నోరెట్లు ఎక్కువని, అయినా రాసిస్తానని చెప్పాను.

"వద్దు. మీకంత పారితోషికం రావడం నాకు సంతోషం. ఇది నా స్వంత పత్రిక కాదుకదా మీరు త్యాగం చేయడానికి." అని చెప్పారు. ఆ తర్వాత మళ్ళీ ఎన్నడూ నవలని అడగలేదు.

శ్రీ రామోజీరావు తెలుగునాడు అనే పత్రికని కేవలం విదేశాల్లోని తెలుగువారి కోసం కొద్దికాలం నడిపారు.

దానికి శ్రీరామవరపు వేణుగోపాలావు ఎడిటర్. సన్నటి, బరువు లేని కాగితం మీద ఆ పత్రికని, ఏర్ మెయిల్‌లో పంపడానికి అనువుగా అచ్చువేసేవారు నేను రాసిన ఓ కథ అందులో వచ్చింది. శ్రీ రామోజీరావు మూసేసిన ఏకైక పత్రిక అది. తర్వాత ప్రియా ఫుడ్స్ సంస్థని స్థాపించారు. చలసాని ఓసారి నవ్వుతూ నాతో ఇలా అన్నారు.

"మనవాళ్ళకి పత్రికలకన్నా పచ్చళ్ళే ఎక్కువ ఇష్టమని రామోజీరావు గ్రహించారు."

శ్రీ రామోజీరావు అంటే ఆయనకి చెప్పలేనంత అభిమానం. ఆయన్ని ఎవరైనా విమర్శిస్తే, తక్షణం తగురీతిలో సమాధానం చెప్పేవారు.

శ్రీ చలసాని ఓసారి నాతో ఇలా అన్నారు.

"ఓసారి నేను శ్రీ రామోజీరావుకి మన పానకాన్ని బాటిల్స్‌లో అమ్మమని సూచించాను. యాలక్కాయ, బెల్లంతో ఘుమఘుమలాడే అది కోకోకోలా కన్నా ఆరోగ్యం కదా!" అని. కానీ శ్రీ రామోజీ ' మనం కోకోకోలా కంపెనీ వాళ్ళతో వేగలేం' అని జవాబు చెప్పారు."

ఆయనకి ఓ కూతురు, కొడుకు. కూతురు రేఖ వివాహం హాలిడే ఇన్ కృష్ణాలో ఓ పంజాబీ అబ్బాయితో జరిగింది. దానికి కొద్దిమంది ఆప్తులనే పిలిచారు. అంతకు వారం క్రితం వారబ్బాయి రఘుకిరణ్ వివాహం విజయవాడలో అయింది. వారి కోడలిని రేఖ పెళ్ళిలో నాకు పరిచయం చేసారు. ఆ పెళ్ళికి శ్రీ రామోజీరావు, అట్లూరి రామారావు కలిసి వచ్చి దంపతులని ఆశీర్వదించి, కొద్దిసేపు కూర్చుని వెళ్ళిపోయారు. పెళ్ళయ్యాక రేఖ అమెరికాకి వెళ్ళిపోయింది. ఫేస్ బుక్‌లో మా ఆఖరి అమ్మాయి లిపికి ఫ్రెండ్స్ లిస్ట్‌లో ఉంది.

నేను రాసిన 'కథలెలారాస్తారు?' చదివిన ప్రసాదరావుగారు ఆ పుస్తకం చదవమని, విపులకి కథలు, అనువాదాలు రాసేవారికి ఓ ప్రింటెడ్ ఉత్తరాన్ని రాసి, వారి చిరునామాలతో పాటు నాకిచ్చారు. వాటన్నిటినీ నేను పోస్ట్ చేసాను. అటు విపులకి దీనివల్ల బెనిఫిట్ - ఇటు నాకు కూడా. ఇలాంటి విశాల హృదయం ఎడిటర్స్‌లో ఒక్క చలసానిలోనే నేను చూసాను.

ఆనాటి తరంలో మచ్చలేని, సమర్ధతగల ఎడిటర్స్‌లో శ్రీ చలసాని ప్రసాదరావు ఒకరు. ఆయన తీరని కోరిక ఒకటుంది. 'పెన్ స్కెచెస్' అనే పేరుతో ఎడిటర్‌గా తనకి పరిచయమున్న వివిధ వ్యక్తుల గురించి తలో పేజీ రాయాలనుకునేవారు.

ఓ రోజు ఈ టివి ఛానెల్లో ప్రసాదరావుగారి అమ్మాయి రేఖ యాంకరు గర్ల్‌గా ఓ కార్యక్రమంలో వచ్చింది. తరవాత నా భార్య పద్మజ ప్రసాదరావుగారితో ఆ విషయం చెపి, ప్రోగ్రాం బావుందని చెపితే ఆయన ఇలా అడిగారు:

"మా అమ్మాయి వాయిస్ ఎలా ఉంది?"

**NEW**
Click here to share your comments on this story